కాసానిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం


ఆర్‌కేపురంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని అల్కాపురిలో గడప గడపకు వెళ్లి పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ శర్మ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయలేక పోయిందని, మళ్లీ కొత్త వాగ్దానాలతో ప్రజలను మోసం చేయడానికి వస్తోందని విమర్శించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి రవీందర్ రావు, కొండల శ్రీనివాస్, శ్రీనివాస్ గొడుగు, వెంకటేష్ గౌడ్, జహీద్, బాలు శ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో గళం వినిపిస్తా

మల్కాజిగిరి పార్లమెంట్ స్వతంత్ర ఎంపీ అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్


వైష్ణవీ ప్రసాద్‌కు మద్దతు తెలుపుతున్న కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు

నాగోలు: ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తనని ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై గళం వినిపిస్తానని మల్కాజిరిగి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి పెండ్యాల శేషసాయి వరప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం, ఉప్పల్ నియోజకవర్గం, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్ పరిధిలోని వివిధ కాలనీల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో నిత్యం ప్రజల మధ్యే ఉండేవాడినని, ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటానని తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అభివృద్ధి చేసేందుకు తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. బ్రహ్మశ్రీ సుభాష్ పత్రిజీ ఆశీస్సులతో పిరమిడ్ పార్టీ బలపర్చిన తనను ఫ్లూట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి చౌరస్తాలోని కృష్ణా కాంప్లెక్స్‌లో సమావేశం నిర్వహించారు. పలు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు వైష్ణవీ ప్రసాద్‌కు మద్దతు ప్రకటించారు. నేతాజీ రెసిడెన్షియల్ అసోసియేషన్ నాయకులు శ్రవణ్‌యాదవ్, సుధాకర్, సంఘం నాయకులు సుబ్రహ్మణం, శ్రీనివాస్, మంజుల, శ్రీవాణి, అరుణ, రాజేశ్వరి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి



మలక్‌పేట: మూసారంబాగ్ అవంతి డిగ్రీ, పీజీ కాలేజీలో పునరుజ్జీవనం–2024 కార్యక్రమం నిర్వహించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్, ఊబర్ డేటా సైంటిస్ట్ షారీఖ్ ఫర్హాన్, అవంతి విద్యాసంస్థల హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద హాజరయ్యారు. వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బెల్లంకొండ రాజశేఖర్ మాట్లాడుతూ.. టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు కమ్యూనికేషన్స్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. చాట్ జీపీటీ వంటి సాధనాలను జ్ఞాన సముపార్జన కోసమే వాడలని షారీఖ్ ఫర్హాన్ సూచించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, విజయ్ కుమార్, డాక్టర్ అజ్మత్ హుస్సేన్, డాక్టర్ శివప్రసాద్, లెక్చరర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హోమ్ ఓటింగ్


శ్రీనివాసపురంలో ఇంటి వద్దే ఓటు వేస్తున్న సీహెచ్ సరోజిని (89)

ఎల్‌బీనగర్: ఎల్‌బీ నగర్‌లో హోమ్ ఓటింగ్‌ను అధికారులు, సిబ్బంది పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ జరిగేలా ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఆదివారం నుంచి ఇంటి వద్దే ఓటు వేసే ప్రక్రియను ప్రారంభించారు.ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అర్హత కలిగిన 3722 మంది వయోవృద్ధులు, 4,812 మంది దివ్యాంగులు ఉన్నారు. ఇందులో 179 మంది వృద్ధులు, 50మంది దివ్యాంగులు ఫారం 12డీని నింపి ఎన్నికల అధికారులకు పంపించారు. వీరి దరఖాస్తు ఫారాలను పరిశీలించిన ఎన్నికల అధికారులు 179 మంది వృద్ధులకు, 34మంది దివ్యాంగులకు ఓటు హక్కు కల్పించారు.ఆదివారం ప్రారంభమైన ఈ ప్రక్రియ బుధవారం వరకు కొనసాగుతుందని,అధికారులు దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఓటు వేయిస్తారని తెలిపారు.ఆదివారం పలువురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు మాట్లాడుతూ, తమ ఓటు వృథా కాకుండా ఇంటి వద్దే వేశామని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఆయన రామకృష్ణాపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లోని సాయి బాబా నగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుపై ఓటు వేసి రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం


హయత్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

మన్సూరాబాద్: దేశం కోసం మోదీ పనిచేస్తున్నాడని, మోదీ కోసం మనందరం కమలం పువ్వు గుర్తుకు ఓటేద్దామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, వినాయక్‌నగర్‌కాలనీ, రాజరాజేశ్వరీకాలనీ, పవనగిరికాలనీ, సిరిహిల్స్, అంజలి రెసిడెన్సీ, స్వాతి రెసిడెన్సీ తదితర కాలనీల్లో ఆదివారం బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్, ప్రధాన కార్యదర్శి హరీష్‌రెడ్డి, నాయకులు సాయిరామ్‌గౌడ్, కొండల్‌రెడ్డి,వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కాషాయ జెండా ఎగరడం ఖాయం


బతుకమ్మలతో ఎంపీ అభ్యర్థి మాధవీలత, కార్పొరేటర్లు భాగ్యలక్ష్మి, అరుణ, మంజులారెడ్డి

మలపేట: బీజేపీ ప్రచారానికి మహిళలు, యువత నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోందని ఆ పార్టీ హైదరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి మాధవీలత కొంపెల్ల అన్నారు. మూసారంబాగ్ గడ్డిఅన్నారం ఎన్నికల కార్యాలయంలో శనివారం రాత్రి భాగ్యనగర్ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి బీజేపీని గెలిపించాలని మహిళలను కోరారు. జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో బీజేపీని చూసి ప్రత్యర్థుల గుండెల్లో రైలు పరుగెతున్నాయన్నారు.లోక్‌సభ ఎన్నికల్లో కాషాయ జెండాను ఎగురవేయం ఖాయమన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, కొత్తకాపు రవీందర్‌రెడ్డి,మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మంజులారెడ్డి, కిషాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మడిగెల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలి

మన్సూరాబాద్: బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని వీరన్నగుట్ట బస్తీలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, ఏఆర్‌సీరెడ్డి, చంద్రారెడ్డి, జగదీష్‌గౌడ్, కొసనం వెంకట్‌రెడ్డి, నర్సింహగౌడ్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి


మధురానగర్ కాలనీలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నాగోలు: త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటు వేస్తేనే ప్రశ్నించే హక్కు ఉంటుందని నాగోలు బండ్లగూడ మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్ రావు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ నరసింహా రెడ్డి పిలుపునిచ్చారు. మధురానగర్ కాలనీ సంక్షేమ సంఘం, సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఆదివారం మధురానగర్ కాలనీ, శివశంకర్ కాలనీ, ధనలక్ష్మి కాలనీ, న్యూ రాఘవేంద్ర కాలనీ, ప్రకృతి నివాస్, బృందవాన్ అపార్ట్‌మెంట్స్‌లో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి పౌరుడికి ఓటు రాజ్యాంగ కల్పించిన హక్కు అని, ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఈనెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో తప్పకుండా పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సహాయ కార్యదర్శి బి.ప్రశాంత్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జగదేశ్వర్, కోశాధికారి ప్రదీప్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.మోహనా చారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఎంఐఎంను గెలిపించండి

ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో పతంగి గుర్తుకు ఓటేసి ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీని అధిక మెజార్టీతో గెలిపించాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల కోరారు. మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్‌లో ఆదివారం ఆపార్టీ సీనియర్ నేత కనుకల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్ మీటింగ్‌కు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని, ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో వేణుగోపాల్‌రావు, కృష్ణారెడ్డి, హరి, జీవీ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడ, సాంస్కృతిక రంగాల్లో ప్రావీణ్యం సాధించాలి


బహుమతులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ శ్రీసాయి డిగ్రీ, పీజీ కాలేజీలో ట్రెడిషనల్, స్పోర్ట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, క్యారమ్, చెస్, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు కాలేజీ ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి బహుమతులు అందజేసి అభినందించారు. ట్రెడిషనల్ డేలో పాల్గొన్న విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. ఆట, పాటలతో విద్యార్థులు సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. దేశ సంస్కృతీ సంప్రదాయాల విశిష్టతను పెంపొందించాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో మేటిగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసాచార్యులు, లెక్చరర్లు శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శోభారాణి, అపర్ణ, లావణ్య, సుష్మ, షర్మిల పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా పక్షపాతి


మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి

లింగోజిగూడ: కాంగ్రెస్ పార్టీ మహిళా పక్షపాతి అని, వారి అభివృద్ధికి కట్టుబడి ఉందని, గతంలో కూడా డ్వాక్రా గ్రూప్‌లను ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేసిందని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ఎన్నికల కోర్డినేటర్, సీఎం సోదరుడు ఎనుముల కొండల్‌రెడ్డి అన్నారు.ఎన్నికల ప్రచారంలో జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రీన్ పార్క్ కాలనీలో పలు కాలనీల సంక్షేమ సంఘాలు, కాలనీల వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎల్బీనగర్ నియోజకవర్గంలో ముంపు సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నాడని, సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. పార్టీ నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ వెంకటేశ్వరరెడ్డి, మిద్దెల జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి: జక్కిడి

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్ రెడ్డిని గెలిపించాలని టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి కోరారు. నాగోలు డివిజన్ పరిధి సౌత్‌ఎండ్ పార్కుకాలనీలో ఆదివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు నర్సింహారెడ్డి, మంజులారెడ్డి, రవీందర్, వెంకట్‌రెడ్డి, గౌరి తదితరులు పాల్గొన్నారు.